www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 8 ఏప్రిల్ 2025

5

తిరుపతి

12న తిరుమలలో తుంబురుతీర్థ ముక్కోటి

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి ఏడున్నర మైళ్ల దూరంలో వెలసివున్న శ్రీ తుంబురు తీర్థ ముక్కోటి ఉత్సవం ఏప్రిల్ 12న జరుగనుంది. తిరుమలలోని శేషగిరులలో 3 కోట్ల 50 లక్షల పుణ్యతీర్థాలు ఉన్నాయని ప్రతీతి. ప్రకతి సౌందర్యాల నడుమ నిర్వహించే తుంబురు తీర్థ ముక్కోటిని దర్శించి, స్నానమాచరించడం ఒక ప్రత్యేక అనుభూతిగా భక్తులు భావిస్తారు. ఈ ముక్కోటిలో టీటీడీ అధికారులు, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారు.

తిరుపతి పురవీధుల్లో ర్యాలీ, ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట మహాధర్నా

కాంట్రాక్టర్లపై ప్రేమ... కార్మికులపై లేదా..?

'డిస్కం'..నిర్లక్ష్యం..!

దీర్ఘకాలిక డిమాండ్లపై తిరుపతిలో వేలాదిమందితో భారీ ధర్నా, ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

'చట్ట ప్రకారం కార్మికులకు రావాల్సిన డిఎలు, టిఎలు, అరియర్స్ ఇవ్వరు. రెగ్యులరేజేషన్ ఊసేలేదు. అసలు ఈ కాంట్రాక్టు వ్యవస్థకు కారణం చంద్రబాబునాయుడు ప్రైవేటీకరణ వైపు చూపిన ఆసక్తే. అదానీ, అంబానీలకు కాంట్రాక్టుల ద్వారా కోట్ల రూపాయలు దోచి పెట్టేందుకు సమావేశాలు జరిపే అధికారులు, కార్మికుల సమస్యలపై స్పందించరు ఎందుకని..? 14 రోజులుగా కాంట్రాక్టు కార్మికులు తిరుపతి డిస్కం కార్యాలయం ఎదుట రిలే దీక్ష చేస్తుంటే ఏమాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు... ఇప్పటికైనా కాంట్రాక్టర్లకు చేసింది చాలు.. కాంట్రాక్టు కార్మికుల గోడు పట్టించుకోండి..' అంటూ వేలాదిగా కాంట్రాక్టు కార్మికులు ధ్వజమెత్తారు. విధి నిర్వహణలో ప్రమాదాల బారిన పడి అనారోగ్యం పాలైనా యాజమాన్యం పూర్తిస్థాయి వైద్యం అందించేందుకు చొరవ లేదన్నారు.

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఎస్పిడిసిఎల్ సిఎండి కార్యాలయం ఎదుట కాంట్రాక్టు కార్మికులు సోమవారం భారీ ధర్నా నిర్వహించారు. 14 రోజులుగా రిలే దీక్షలు చేసినా పట్టించుకోకపోవడంతో మహాధర్నాకు పిలుపునిచ్చిన విషయం విదితమే. లక్ష్మీపురం సర్కిల్ నుంచి వందలాది మంది భారీ ధర్నాగా ఎస్పిడిసిఎల్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. దాదాపు కిలోమీటర్ దూరం ఎర్రజెండాలు చేతబట్టి, మండుటెండలో వారి ర్యాలీ సాగింది.

ధర్నా ఉద్దేశించి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజపర్ అహ్మద్ మాట్లాడుతూ విద్యుత్ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే కాంట్రాక్టు కార్మికులు ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు అరియర్స్ ఇవ్వడానికి సాకులు చెబుతోందని, భారీగా పెంచిన విద్యుత్ ఛార్జీల సొమ్ము ఏ బొక్కసానికి వెళుతోందని ప్రశ్నించారు. రెండు రోజుల్లో

అరియర్స్ ఇవ్వడం ప్రారంభించకపోతే ముట్టడి తప్పదని హెచ్చరించారు. అంబానీ, అదాని, మిట్టల్‌కు కోట్లాది రూపాయలు దోచి పెట్టేందుకు చూపే ఉత్సాహం, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పట్టించుకోవడానికి ఎందుకు లేదన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ మధ్య కొత్త పల్లవి అందుకున్నారని, పి4 విధానంతో డబ్బున్నోళ్లు పేదలకు డబ్బులు పంచాలని చెబుతున్నారని, ప్రజలు డబ్బులను వారికి వారే పంచుకుంటే ఇక ప్రభుత్వాలు ఉండేది ఎందుకని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు యాక్సిస్‌ను తెర పైకి తెచ్చి విద్యుత్తు ప్లాంట్‌ల ఏర్పాటుకై 2019లో వేలకోట్ల రూపాయల అగ్రిమెంట్లు చేసుకున్నారని, ఇప్పుడు మళ్లీ అదే కంపెనీతో అంట కాగుతున్నారని విమర్శించారు. జగన్ ప్రభుత్వం సెకి ఒప్పందం మేరకు విద్యుత్ యూనిట్ రూ. 2.60 పైసలకు చేసుకుంటేనే వందల కోట్ల రూపాయలు లంచాలు చేతులు మారాయని విమర్శలు వస్తున్నాయని, మరి అదే చంద్రబాబు నాయుడు యూనిట్ రూ. 5.60, రూ.4.60 పైసలకు యాక్సిస్ తో ఒప్పందం చేసుకుంటే ఎన్ని వేల కోట్ల రూపాయలు లంచాల రూపంలో చేతులు మారాయో అర్థం అవుతుందన్నారు. గడిచిన నాలుగు నెలల కాలంలోనే 10 వేల కోట్ల రూపాయలు కేంద్రం డిస్కంలకు కేటాయిస్తే, కనీసం 240 కోట్ల రూపాయలతో అరియర్స్ కూడా ఇవ్వలేని యాజమాన్యం, పదివేల కోట్ల రూపాయలు ఏం చేసిందో సమాధానం చెప్పాలన్నారు. విద్యుత్ సంస్థల ఆదాయంలో కాంట్రాక్టర్ కార్మికులకు వేతనాలు ఇతర సౌకర్యాలు కల్పించేందుకు కేవలం 1.4 శాతం కూడా ఖర్చు కాదని, దాన్ని ఇచ్చేందుకు కూడా ఎందుకు వెనుకాడుతున్నారో అర్థం కావటం లేదన్నారు. డిస్కములకు సెలవు రోజుల్లో కూడా కాంట్రాక్టర్లతో సమావేశాలు నిర్వహించే అధికారులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై చర్చించేందుకు అరగంట సమయం కేటాయించలేరా? అని ప్రశ్నించారు. సనాతన ధర్మం లో మునిగి తేలుతున్న రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఆయనను ఆ స్థాయికి తీసుకువచ్చిన సామాన్యులు కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేసేందుకు స్పందించకపోవడం విడ్డూరమన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు నయాబ్ రసూల్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల పట్ల విద్యుత్ యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదన్నారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, నాయకులు టి.సుబ్రమణ్యం, మునిరాజా, నాగ వెంకటేష్, యుఇఇయు అధ్యక్ష కార్యదర్శులు హరి, శివశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్‌రెడ్డి, యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఆరోగ్యదాస్, డిస్కం అధ్యక్ష కార్యదర్శులు సుబ్రమణ్యం రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, కర్నూలు జిల్లా కార్యదర్శి భీమేష్, జాయింట్ సెక్రటరీ రవికుమార్, నాలుగు జిల్లాలకు చెందిన వేలాదిమంది కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

భగ్గుమన్న 'చమురు'

గ్యాస్‌పై రూ.50, పెట్రోల్, డీజిల్‌పై రూ.2 పెంపు

గ్యాస్ పెంపుతో జిల్లాపై రూ.3 కోట్ల 25 లక్షల భారం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గెలుపొందిన సందర్భంగా రంగాలవారీగా సుంకాలు పెంచడంతో చమురు ధరలపై ప్రభావం పడింది. దీంతో కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌పై 50 రూపాయలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే పెట్రోల్, డీజిల్‌పైనా రూ. 2 పెంచుతున్నట్లు వెల్లడించింది.

తిరుపతి జిల్లాలో హెచ్‌పి, ఇండియన్, భారత్ కంపెనీలకు సంబంధించి సిలిండర్లు జిల్లావాసులు వాడుతున్నారు. జిల్లాలో 6లక్షల 50వేల మందికి గ్యాస్ సిలిండర్లు ఉన్నాయి. ప్రస్తుతం సిలిండర్ గ్యాస్ ధర రూ. 851 ఉంది. కేంద్రం 50 రూపాయలు పెంచడంతో జిల్లావాసులపై దాదాపు నెలకు 3 కోట్ల 25 లక్షల రూపాయల భారం పడనుంది. ఈ ప్రభావం అన్ని రంగాలపై ఉంటుంది. ఒక్క తిరుపతి జిల్లాలోనే లక్షా 20వేల మంది గ్యాస్ కనెక్షన్లు కలిగి ఉన్నారు. గ్యాస్ డెలివరి బాయ్‌కి అదనంగా సమర్పించుకోవాల్సిందే. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత భారీగా పెంచడం ఇదే. హోటళ్లు, ఫాస్టుఫుడ్ సెంటర్లపై ప్రభావం పడడంతో ఆహార పదార్థాల ధరలూ పెరిగే అవకాశం ఉంది. పెట్రోల్, డీజిల్ పై రూ. 2 పెంచడం వల్ల రవాణా రంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. సామాన్యులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి నెలా కరెంట్ ఛార్జీల బిల్లులతోనే ఇబ్బందులు పడుతున్న జనానికి ఈసారి గ్యాస్ ధరల భారం తప్పేలా లేదు.

భారాలు మోయలేరు : ఎస్.అజీమ్‌బాష

ఈ విధంగా భారాలు పెంచుకుంటూ పోతే కొన్నాళ్లకు జనం మోయలేని పరిస్థితి ఉంటుంది. ఇప్పటికే లీటర్ పెట్రోల్ 110, డీజిల్ లీటర్ 105 రూపాయలు పలుకుతా ఉంది అదనంగా కేంద్ర ప్రభుత్వం రెండు రూపాయలు పెంచడం వల్ల ద్విచక్ర వాహనదారులకు సామాన్య మధ్య తరగతి ప్రజలకు పెనుభారంగా మారునుంది. ఎంతలేదన్నా ఒక్కో ఇంట్లో గ్యాస్, చమురు ధరల వల్ల నెలకు రూ. 200 పైనే భారం పడే ప్రమాదం లేకపోలేదు.

తక్షణమే తగ్గించాలి : బుజ్జమ్మ

పెంచిన గ్యాస్ పై 50 రూపాయలు తక్షణమే తగ్గించాలి. ఇప్పటికే మహిళలు నెలల కరెంట్ చార్జీలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారు. గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడం వల్ల అన్ని వస్తువులు ధరలు పెరిగే ప్రమాదం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత సిలిండర్‌పై ప్రభావం పడే అవకాశం ఉంది. ధరలు తగ్గించే దానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే మహిళలు ఉద్యమిస్తారు

ఆరోగ్యానికి బడ్జెట్లో 5శాతం నిధులివ్వాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'ఆరోగ్యకరమైన ప్రారంభం..ఆశాజనక భవిష్యత్' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని, ఏటా ప్రపంచవ్యాప్తంగా దాదాపు మూడు లక్షల మది గర్భిణులు మృతిచెందుతున్నారని, 20 లక్షల మంది పురిటిపిల్లలు చనిపోతున్నారన్నారు. నివారించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో ఐదు శాతం నిధులను కేటాయించాలని వక్తలు డిమాండ్ చేశారు. గర్భిణులకు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని సోమవారం ఇండియన్ డాక్టర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ ఆర్‌ఆర్ రెడ్డి కరపత్రాలను అందజేసి, మజ్జిగ పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలపై అందరికీ వివరించారు. ఐఎంఎ డాక్టర్ రెడ్డెప్ప, మెడికల్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి టి.రామకృష్ణ, రాష్ట్ర కమిటి సభ్యులు ఆనంద్, జిల్లా కార్యదర్శి కిరణ్, నాయకులు ప్రవీణ్‌కుమార్, గాంధీ, శ్రీనివాస్, గురునాథ్ పాల్గొన్నారు.

మోడీ వైఖరి మారకుంటే.. నిరవధిక సమ్మె

పోస్టల్ రాష్ట్ర మహాసభల్లో వక్తల ధ్వజం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

కార్పొరేట్లను సంతప్తి పరచటానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగానికి ఉరి వేస్తోందని వక్తలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చూస్తూ కూర్చుంటే మోడీ దేశాన్ని కార్పొరేట్ పరం చేయడం ఖాయమని హెచ్చరించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ప్రారంభమైన ఆల్ ఇండియా 4వ ద్వైవార్షిక సర్కిల్ సమావేశాల్లో భాగంగా సోమవారం ప్రతినిధుల సమావేశం జరిగింది. ముఖ్య అతిధిగా ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ పోస్ట్ మెన్, ఎంటీఎస్ జనరల్ సెక్రటరీ ఆర్పీ సారంగ్ హాజరయ్యారు. మోడీ విధానాలపై సారంగ్ నిప్పులు చెరిగారు. లాభాల్లో నడుస్తున్న పోస్టల్‌తో పాటు రైల్వే, రోడ్డు, రవాణా, బొగ్గు గనులు, ఓడల నిర్మాణం, డిఫెన్స్, విద్యుత్తు, స్టీలు, పెట్రోలియం, టెలికం, బ్యాంకు, ఇన్సూరెన్స్ రంగాలను ప్రైవేటుపరం చేయటానికి మోడీ ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఉద్యోగ, కార్మికుల సమస్య కాదనీ, ప్రజలు కూడా ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. 2014 నుంచి తపాలా శాఖను కార్పొరేట్ పరం చేసేందుకు మోడీ ప్రయత్నాలు చేస్తున్నాడని మండిపడ్డారు. అందులో భాగంగా మాజీ క్యాబినెట్ కార్యదర్శి టీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం నేతత్వంలో టాస్క్ పోర్స్ కమిటీని కూడా వేసిందన్నారు. లాభదాయకమైన పోస్టల్ సేవింగ్స్ బ్యాంక్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, స్పీడ్ పోస్ట్, పార్సిల్ వంటి విభాగాలను కార్పొరేట్ చేయడానికి ప్రత్యేక విభాగాలను నియమించినట్లు తెలిపారు. దీనిని వ్యతిరేకిస్తూ ఎన్ఎఫ్‌పీఈ, అనుబంధ సంఘాలు సమ్మె చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే కరోనా కాలంలో రైతులు నిర్వహించిన సమ్మెకు మద్దతు తెలిపి వారికి ఆర్థిక సహాయం అందించారనే నెపంతో ఎన్ఎఫ్‌పీఈ గుర్తింపును రద్దు చేసిందన్నారు. దీనిపై జార్ఖండ్ హైకోర్టు స్టే ఇచ్చినా అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని చెప్పారు. ఇదివరకు ఎప్పుడూ లేనివిధంగా అధికారులు, ఉద్యుగులపై పనిభారం పెంచుతూ టార్గెట్లను విధిస్తూ వేదింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా పలు రకాలుగా ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తూ రావాల్సిన రాయితీలను రాకుండా నిలిపివేస్తున్నారని చెప్పారు. తపాలా ప్రైవేటీకరణలో భాగంగా పీవోఎస్‌బీ ఖాతాలను ఐపీపీబీకి మళ్లించడం ద్వారా చిన్న మొత్తాల పొదుపు విభాగం పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతిలో వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే మానుకుని తపాలా ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం సర్కిల్ వర్కింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి పోస్టల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మోడీ మెడలు వంచేందుకై తీర్మానం చేశారు. ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సర్కిల్ సెక్రటరీ బి.శ్రీధర్ బాబు, మహదేవయ్య, పాండురంగారావు, శరత్ కుమార్, శ్రీనివాసరావు, స్థానిక సంఘం నాయకులు కే. మురళి, కుర్షిద్ బేగం, మదన్ మోహన్ రెడ్డిపాల్గొన్నారు.

టీటీడీకి రూ.కోటి 30లక్షల విరాళం

ప్రజాశక్తి -తిరుమల

టీటీడీ నిర్వహిస్తున్న వివిధ పథకాలకూ సోమవారం రూ.కోటి 30లక్షలు విరాళంగా అందింది. ఒడిశాకు చెందిన శివమ్ కాండేవ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ. 20 లక్షలు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ. 20 లక్షలు, స్విమ్స్ ట్రస్టుకు రూ. 20 లక్షలు, ఎస్వీ సర్వ శ్రేయాస్ ట్రస్టుకు రూ. 10 లక్షలు, ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ. 10 లక్షలు విరాళంగా అందించింది. అదే రాష్ట్రానికి చెందిన బాలభద్ర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ. 10 లక్షలు, ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ. 10 లక్షలు విరాళంగా ఇచ్చింది. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ఆ కంపెనీల ప్రతినిధి వై.రాఘవేంద్ర విశ్వకర్మ విరాళం డీడీలను అందజేశారు. బెంగుళూరుకు చెందిన బీఎంకే నగేష్ అనే భక్తుడు సోమవారం ఎస్వీ సర్వ శ్రేయాస్ ట్రస్టుకు రూ. 30 లక్షలు విరాళంగా అందించారు. అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరికి టీటీడీ బోర్డు సభ్యులు శ్రీ భాను ప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా విరాళం డీడీలను అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో... 'మండే' స్వరం

480 అర్జీల్లో .. రెవెన్యూవి 398

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' సోమవారం యథావిధిగా కొనసాగింది. మొత్తం 480 అర్జీలు రాగా రెవెన్యూవే 398 ఉండటం గమనార్హం. 'ప్రజా సమస్యల స్వరం' కలెక్టరేట్‌లో దద్దరిల్లింది. మండుటెండలోనూ పెద్ద సంఖ్యలోనే అర్జీదారులు రావడం వారి సమస్యల తీవ్రతకు అద్దం పడుతోంది. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ స్వయంగా అర్జీలను స్వీకరించి, వాటిని పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వేసవి దృష్ట్యా అర్జీదారులకు కుండలను, వాటర్ క్యాన్లను అందుబాటులో ఉంచారు. జిల్లా కలెక్టర్ తో పాటుగా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, సుధారాణి, రోజ్ మాండ్ అర్జీలను స్వీకరించారు. ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

కుల దురహంకారంతో హత్యాయత్నం

అద్దూరు రమణమ్మ, చెన్నూరు గిరిజన కాలనీ

మేము ఎస్టీలం. మా పక్క కాలనీ అయిన అగ్రకులాలకు సంబంధించిన పోలిశెట్టి శ్రీను, మేకల మారుతి, పంచేటి శ్రీకాంత్ అనే యువకులు 2023, అక్టోబర్ 17వ తేదీన అర్ధరాత్రి నాపై హత్య ప్రయత్నం చేశారు. నా అరుపులు విన్న నా భర్త అద్దూరి వేణు వెంటనే వారిని నిలువరించడానికి ప్రయత్నించగా నా భర్తపైనా కత్తితో దాడి చేశారు. ఈ విషయమై గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసాము. ఎస్టీలపై దాడి జరిగితే చట్ట ప్రకారం జీవనోపాధికి ఇబ్బందులు కలగడం వల్ల ప్రభుత్వం నుండి బెనిఫిట్లు రావాల్సి ఉంది. దీనికోసం గడిచిన రెండేళ్లుగా జిల్లా కలెక్టర్ ఆఫీస్ చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ బెనిఫిట్లను అందించాలి.

తిరుపతి రూరల్‌లో భూములు అన్యాక్రాంతం

మూలం చంద్రమోహన్, ఎంపిపి

తిరుపతి రూరల్ మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, సంబంధిత రెవెన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని సోమవారం తిరుపతి రూరల్ మండల కార్యాలయంలో ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీలు విడదల మాధవరెడ్డి, యశోదమ్మ తదితరులు జిల్లా కలెక్టర్ కు లిఖితపూర్వకంగా రూరల్ మండల తహశిల్దార్ పై ఫిర్యాదు చేశారు. 9 సర్వే నంబర్లలో ఆక్రమణలు పెచ్చుమీరాయని, కోట్ల విలువ చేసే భూమిని అధికారులు కాపాడటం లేదు.

క్వారీ పేలుళ్లతో బాలునికి ప్రమాదం :

వై.నందయ్య, ఎస్సీఎస్టీ సంఘం జిల్లా కార్యదర్శి, పుత్తూరు

పుత్తూరు మండలం ఈశ్వరాపురం పరిధిలోని ఆరు క్వారీలలో ఎటువంటి ముందస్తు హెచ్చరికలు, సైరన్లు మోగించకుండా ఇష్టానుసారంగా పేలుళ్లకు పాల్పడుతూ, చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులను గాయాలు పాలు చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఓ క్వారీ నుండి పేలుడు సంభవించడంతో ఓ బాలుడు స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై అధికారులు విచారణ కూడా చేశారు. బాధిత బాలుడు కుటుంబానికి 10 లక్షల రూపాయల నష్టపరిహారాన్ని ఇవ్వాలి. ఎటువంటి ముందస్తు సైరన్లు మోగించకుండా పేలుళ్లకు పాల్పడుతున్న క్వారీ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

పంచాయతీ నిధులు దుర్వినియోగం : కె.రాజేష్, విప్పమానుపల్లి

రేణిగుంట మండలం విప్పమాను పంచాయతీలో కోటి 28 లక్షల రూపాయల పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని, జిల్లా పంచాయతీ సంబంధించిన అధికారులు ధ్రువీకరించినా ఇప్పటివరకు బాధ్యులపై చర్యలు చర్యలు తీసుకోలేదు. ఇప్పటికే నాలుగు సార్లు జిల్లా కలెక్టరేట్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీ రూపంలో మోసాన్ని తెలిపాను. అయినా ఇక్కడి అధికారులు పట్టించుకోకవడం చూస్తుంటే ప్రజాధనం దుర్వినియోగం పట్ల జిల్లా ఉన్నతాధికారులకు బాధ్యత లేనట్లుగా తెలుస్తోంది.

శ్మశానానికి దారి చూపాలి : గురవయ్య, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, పర్యావరణ చైతన్య వేదిక అధ్యక్షులు, పుత్తూరు

రేణిగుంట మండలం మొలగమూడి రెవెన్యూ లెక్క దాఖలా అత్తూరు పంచాయతీలో సర్వే నంబర్లు 71/1లో 21 సెంట్లు, 71/2బి లో 07 సెంట్లు భూమిని గత కొన్నేళ్లుగా ఎస్సీ స్మశాన వాటికగా వినియోగించుకుంటున్నారు. స్మశానానికి సరైన దారి మార్గం లేక పోవడంతో ఎవరైనా చనిపోతే పక్కనే ఉన్న పొలాలపై శవాన్ని దహన క్రియలకు తీసుకొని వెళ్లే పరిస్థితి. శవాన్ని తీసుకెళ్లాలంటే పక్క పొలాల వారి దయాదాక్షిన్యాల పైన ఆధారపడవలసి వస్తోంది. కలెక్టర్ స్పందించి స్మశానానికి దారి చూపాలి.

'కార్పొరేషన్'లో 34 వినతులు : కమిషనర్

తిరుపతి టౌన్ : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 59 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా 8 మంది తమ సమస్యలు తెలుపగా, 26 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. కాగా శాప్ చైర్మన్ రవి నాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికష్ణ, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ లు విచ్చేసి టిడిఆర్ బాండ్ల అవకతవకలకు పాల్పడిన వారిపై విచారణ జరపాలని, ఇవ్వాల్సిన వారికి పారదర్శకంగా అందజేయాలని కమిషనర్ ను కోరారు. వేశాలమ్మ గుడి వద్ద సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ నరసింహ ఆచారి కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య ఉన్నారు.

టిడిపిలో గ్రూపులు ఇలా..

ఒకే సమస్యపై వేర్వేరుగా..

'ఆక్స్ ఫర్డ్' లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి స్థానిక ఆక్స్ ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పబ్లిక్ స్కూల్లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాలుగవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఐదవ తరగతిలోకి అడుగిడుతున్న సందర్భంగా మధుసూదన్ రెడ్డి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ప్రతి తరగతి గట్టు.. విద్యార్థి భవిష్యత్తుకు తొలి మెట్టని కితాబిచ్చారు. గ్రాడ్యుయేషన్ డే ని తల్లిదండ్రుల మధ్యన జరుపుకోవడం ఆనందంగా ఉందని వివరించారు.

'గంగమ్మ తల్లినీ' ప్రచారానికి వాడేశారు: ఆరణి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ గత ఐదేళ్లలో గంగజాతర సంప్రదాయాలను పక్కనపెట్టి ఇష్టానుసారం సొంత ప్రచారానికి గంగమ్మ తల్లినీ వదలలేదని ఎంఎల్ఏ ఆరోపించారు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జరుగుతున్న అభివద్ధి పనులను సోమవారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిశీలించారు. జాతర చాటింపు నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. దేవాదాయ శాఖ, టిటిడి ఇచ్చిన దాదాపు రూ. 6 కోట్ల రూపాయల పనులు సాగుతున్నట్లు ఈవో తెలిపారు. ఎన్డీఏ నాయకులు మహేష్ యాదవ్, రాజా రెడ్డి, కెఎంకే లోకేష్, ఆర్కాట్ కష్ణప్రసాద్ పాల్గొన్నారు.

స్పందనకు వందనం

నీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - బాలాయపల్లి: బాలాయపల్లి మండలం, వేల్పూరు, పిరమిడ్ పంచాయతీ, ఎస్టీ కాలనీలో తాగునీరు లేక, కలుషిత గుంటలోని నీరు కాలనీవాసులు తాగుతున్న విషయంపై ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాలనీలో తాగు నీటి పైపు లైన్ ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నో పర్యాయాలు అధికారులకు అర్జీలు పెట్టుకున్నప్పటికి సమస్య పరిష్కారం కానందున, కాలనీవాసులు వారి ఆవేదన ప్రజాశక్తికి తెలియజేశారు. అధికారుల్లో కదలిక తెచ్చిన ప్రజాశక్తి యంత్రాంగానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ గాయత్రిలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, శ్రీ గాయత్రీ ఇంగ్లీషు మీడియం స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా హాజరైన గూడూరు పట్టణ యస్ఐ తిరుపతయ్య చిన్నారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం మంచి కార్యక్రమమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, అకడమిక్ డీన్ శ్రీహరి, ఉపాధ్యాయులు మస్తాన్బీ, ఉమా మహేశ్వరి, హరిత, జ్యోతి స్వరూప్, మునిరాజా, నసీరా, రమ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కత్తిసాములో నారాయణ విద్యార్థుల ప్రతిభ

మాట్లాడుతున్న నారాయణ విద్యాసంస్థల ప్రిన్సిపల్ తులసి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీలలో ఉత్తమ ప్రతిభ చాటి, జాతీయ స్థాయి పోటీలకు తమ విద్యార్థులు ఎంపికయ్యారని తిరుపతి శ్రీనివాస మంగాపురం నారాయణ గర్ల్స్ క్యాంపస్ ప్రిన్సిపల్ తులసి, రీజనల్ ఇన్చార్జ్ సురేష్‌లు తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గర్ల్స్ క్యాంపస్లో 8వ తరగతి చదువుతున్న గోప్రిక, శ్లోక, సుదీక్షలు ఒరిస్సా రాష్ట్రం కటక్ జేఎన్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన 26వ సబ్ జూనియర్ నేషనల్ ఫెన్సింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో రాష్ట్రం తరపున ఆడారన్నారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

ఘనంగా నలంద పాఠశాల వార్షికోత్సవం

సంస్కృత విద్యాపీఠం ఉపకులపతి కృష్ణమూర్తిని సత్కరిస్తున్న పాఠశాల యాజమాన్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విద్యార్థి దశ చాలా కీలకమైనదని, ఆ దశలోనే ప్రపంచాన్ని అర్థం చేసుకునే మార్గాలపై బోధన జరిగేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు చేయూతనివ్వాలని సంస్కృత విద్యాపీఠం ఉపకులపతి జిఎస్ఆర్ కృష్ణమూర్తి విద్యార్థులకు సూచించారు. సోమవారం నలంద పాఠశాల 35వ వార్షికోత్సవం సందర్భంగా ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులకు విద్యతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించే క్రీడలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులు మంచి ఆలోచనలను కలిగి ఉండి, ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేయాలన్నారు. సామాజిక మాధ్యమాలకు బానిసలవకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, రవీంద్రనాథ్ రెడ్డి, భాస్కర్ రాజు, సుబ్రహ్మణ్యం రాజు, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని స్థానిక బైరాగిపట్టెడలోని కొండారెడ్డి రాయలసీమ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సైన్స్ (రిమ్స్) కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సి కంప్యూటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంప్లాయబిలిటీ స్కిల్స్ పై ఏడు రోజుల ట్రైనింగ్ పై సదస్సును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.జె.ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రణాళికలను ఆచరించాలన్నారు. మ్యాజిక్ బస్ ప్లేస్ మెంట్ ఆఫీసర్ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడు రోజుల సదస్సులో సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ సిల్స్, కెరీర్ ప్లానింగ్, మాక్ ఇంటర్వ్యూలపై శిక్షణను ఇస్తామన్నారు. ఈ కార్యక్రములో వై కొండారెడ్డి, వై ఆనంద్ రెడ్డి, వై విజయరెడ్డి, హెచ్ ఓ డి లు డాక్టర్ పి నిరంజన్ రెడ్డి, పి మధుర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాయితీ, నిబద్ధతే నిలకడగా ఉంటుంది



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల 9న జరగనున్న వెంకటగిరి పురపాలక సంఘం కౌన్సిల్ అవిశ్వాస తీర్మానంలో వైసిపి విజయం సాధిస్తుందని వెంకటగిరి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనాను కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి పురపాలక ఎన్నికలలో వైసిపి ఘన విజయం సాధించిందన్నారు. అయితే టీడీపీ నేతలు కావాలనే అవిశ్వాస తీర్మానం పెట్టి , కౌన్సిల్లో గందరగోళం సృష్టించాలని కుట్ర పన్నుతున్నారన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఈనెల 9న వెంకటగిరి మున్సిపాలిటీకి అవిశ్వాస తీర్మానం నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఎన్నికకు సంబంధించి గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాను ఎన్నికల అధికారిగా నియమించారు. ఈ ఎన్నికను వాయిదా వేయాలని కుట్రతో టీడీపీ ప్రయత్నిస్తుందని, ఆదివారం నుంచే పలువురు కౌన్సిలర్ల ఇళ్లకు వెళ్లి బెదిరింపులకు పాల్పడడంతో పాటు, పోలీస్ స్టేషన్లకు పిలిపించడం ఎంత వరకు సబబన్నారు. వారి బెదిరింపులకు, ప్రలోభాలకు వైసిపి కౌన్సిలర్లు ఎవ్వరూ లొంగలేదన్నారు. ఎన్నికను కలెక్టర్ అదేశాల మేరకు యధావిధిగా ఈనెల 9 వ తేదిన నిర్వహించాలని కోరారు. జమిలి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసిపిదే విజయమని, జగన్మోహన్ రెడ్డి సిఎం కావడం తథ్యమని చెప్పారు. ఈయన వెంట ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జి తహశీల్దారు, వీఆర్వోలు కావలెను

- ఆర్సీపురం తహశీల్దార్ మెడికల్ లీవ్.. ఇన్‌చార్జి తహశీల్దారు లేరు..!
- ఇక్కట్లు పడుతున్న రైతులు, ప్రజలు, విద్యార్థులు
- తహశీల్దారు నియామకం జరిగేనా.. సమస్యలు పరిష్కారం అయ్యేనా..?
- అనుపల్లి రెవెన్యూకు వీఆర్వోను నియమించండి



తహశీల్దారు కార్యాలయంలో పనులు జరుగక అధికారులతో మాట్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - రామచంద్రపురం : తిరుపతి జిల్లా, రామచంద్రాపురం మండల రెవెన్యూ తహశీల్దార్ కే.వెంకట రమణ అనారోగ్య కారణంతో మెడికల్ సెలవు పెట్టారు. ఇంచార్జ్ తహశీల్దారు లేరు. దీంతో గత వారం రోజులుగా విద్యార్థులు, రైతులు, ప్రజలు పనులు జరుగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాహసిల్దార్ మే నెలలో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఏప్రిల్ 30వ తేదీ వరకు సెలవు పెట్టి వెళ్లారు. అప్పటినుండి మండలంలోని రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు, భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు మ్యుటేషన్ దరఖాస్తులు చేసుకుని ఉన్నారు. మరి కొంతమంది రైతులు గ్రామకంఠాలలో ఇంటి అనుభవ ధ్రువపత్రాల కోసం, మరి కొంతమంది వివిధ రెవెన్యూ సమస్యలతో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు నవోదయ, గురుకుల, పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీలకు దరఖాస్తులు చేసుకునేందుకు కులం, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన ధ్రువపత్రాలు కోసం దరఖాస్తులు చేసుకొని, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దరఖాస్తు దారులు, ప్రజలు, విద్యార్థులు సర్టిఫికెట్లు మంజూరు చేయండి సారూ అంటూ కార్యా లయ సిబ్బందిని వేడుకుంటున్నారు. తహసిల్దార్ డిజిటల్ సిగ్నేచర్ లేనందున, ఇన్చార్జి తాహసిల్దార్‌ను జిల్లా ఉన్నతాధి.కారులు నియామకం చేయక పోవడంతో సర్టిఫికెట్లు మంజూరు చేయంలేమని సిబ్బంది చేతులు ఎత్తేస్తున్నారు. దీంతో విద్యార్థులు దరఖాస్తులు చేసుకు నేందుకు గడువు ముగింపు దగ్గరకు వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రామచంద్రాపురానికి ఇంచార్జ్ తాహసిల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

అర్జీలన్నీ పెండింగే..

ఆర్‌సి పురానికి గత వారం రోజులుగా తాహసిల్దార్ లేకపోవడంతో పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల సమస్యలు అర్జీలు పరిష్కారంకాక, కుప్పలుగా పడి ఉన్నాయి. అలాగే రైతులు భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు మ్యుటేషన్ దరఖాస్తులు కూడా సుమారు 20కి పైగా పెండింగ్‌లో ఉన్నాయి. కులము, ఈడబ్ల్యూఎస్, ఈబిసి, ధ్రువపత్రాల దరఖాస్తులు సుమారు 50 కు పైగా పెండింగ్ ఉన్నాయి. ఇన్చార్జి తాహసిల్దార్ నియామకం జరిగేనా..! రెవెన్యూ సమస్యలు పరిష్కారం అయ్యేనా..? అంటూ ప్రజలు వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారు.

అనుపల్లి పంచాయతీలో వీఆర్వో, కార్యదర్శి పోస్టులు ఖాళీ

మండలంలో రెండు రెవెన్యూ ఇన్స్పెక్టర్ల పోస్టులు, అనుపల్లి రెవెన్యూ గ్రామానికి వీఆర్వో పోస్టు, పంచాయతీ కార్యదర్శి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండ లంలోని అతిపెద్ద పంచాయతీ అయిన అనుపల్లి గ్రామపంచాయతీకి పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారిని నియమించాలని పంచాయతీ ప్రజలు కోరుతు న్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ స్పందించి ఆర్సి పురానికి తహసిల్దార్ను నియమించకపోతే ప్రవేశాలకు దర ఖాస్తు చేసుకునేందుకు గడువు ముగిసి విద్యార్థులు ఇబ్బంది పడతారు. విద్యార్థుల తల్లిదండ్రులు మా పిల్లల భవిష్యత్ అగమ్య గోచరమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రామచంద్రాపురం ఇన్చార్జ్ తాహశీల్దారును నియమించాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

ఎంపీపీగా మూలం చంద్రమోహన్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: గత నెల 27వ తేదీన జరిగిన తిరుపతి రూరల్ ఎంపీపీ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి మూలం చంద్రమోహన్‌రెడ్డి విజయం సాధించిన విషయం విధితమే. ఈమేరకు ఆయన తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో సోమవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. వైసీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం వైస్ఎంపీపీ మాదవరెడ్డి, యశోద, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు నాయకులు చంద్రమోహన్ రెడ్డిని సన్మానించారు.

తాటిపర్తికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత తాటిపర్తి చెంచిరెడ్డిని, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సోమవారం పరామర్శించారు. చెంచురెడ్డి అనారోగ్యం, వృద్యాప్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయనను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని పార్టీ క్రియాశీలక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, శ్రీవారి సురేష్, పీఎం చంద్ర, ముని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలు ప్రతిభకు దర్పణాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండవ పట్టణం, మాళవ్య నగర్. శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 2024 - 25 సంవత్సరానికి గాను అత్యుత్తమ మేధా శారీరక ప్రవర్తనా ప్రతిభ కనబరిచిన టువంటి విద్యార్థిని విద్యార్థులకు బహుమ తుల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గూడూరు పట్టణ ప్రముఖ యోగ అధ్యాపకులు రాజా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మేదస్సుకు శారీరక వ్యాయామం ఉండాలని అందుకు యోగాసనాలు ఉపయోగపడతాయన్నారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీ నవకోటి నాయుడు మాట్లాడుతూ ఈ వేసవి సెలవులలో పిల్లలకు భవిష్యవాణి అనే ఒక పుస్తకాన్ని ఇస్తామన్నారు. అందులో సూచనలు తప్పకుండా పాటించే విధంగా తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని వారితో సంయమనం పాటిస్తూ వారి దగ్గర ఆ పనులు చేయించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ సి.డి. సునీల్ రాజు అకడమిక్ కో-ఆర్డినేటర్ కె. హరికృష్ణ , ప్రైమరీ ఇన్ - చార్జ్ సి. సింధు , ఉపాధ్యాయులు , విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

సమయపాలనకు అధికారులు దూరం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణలో అమలు కాని కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం మండల తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు సమయ పాలనకు దూరమయ్యారు. ఈ కార్యక్రమ ప్రధాన నిర్వాహక మండల స్థాయి అధికారులు 9-25 నిమిషాలు దాటుతున్నా కాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. జిల్లా కలెక్టర్ ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశాలు జారీ చేశారు. మండల పరిధిలో జరిగిన గ్రీవెన్స్ డేకు ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే 9 గంటలకే హాజరవగా, మిగితా శాఖల అధికారులు రాలేదు. ఆ శాఖల అర్జీదారులకు ఎవరికి ఇవ్వాలో అర్థం కాలేదు. ఆలస్యంగా వచ్చినా ఏవైనా అర్జీలు వస్తే ఆఫీసు వాళ్లే చూసుకుంటాంన్న ధోరణిలో సంతకాలు పెట్టి సమయం ముగియకముందే వెళ్ళిపోతు న్నారు. కొందరైతే ఇది సాధారణ కార్యక్రమమే కదా మనం వెళితేనేమి, వెళ్లకపోతే నేమి అన్నట్లుగా గ్రీవెన్స్ డే కార్యక్రమానికి గైర్హాజరవుతున్నారని సమాచారం. వీరిపై నిర్వహణ ప్రధాన అధికారి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం లేదనే అభియోగాలున్నాయి. ఇకనైనా అధికారులు మారాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

రేణిగుంట ఐపిఎఫ్ సందీప్ తిరుపతికి బదిలీ

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిఐ సందీప్ కుమార్‌ను రేణిగుంట ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, తిరుపతి ఐపీఎఫ్ మధుసూదన్ రావు, సర్పంచ్ నగేశం ఘనంగా సన్మానించారు. రేణిగుంట ఐపిఎఫ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సందీప్ కుమార్ బదిలీపై తిరుపతికి వెళ్లారు. ఐపీఎఫ్ సందీప్ కుమార్‌ను పట్టణ ప్రముఖులు, మార్వాడీలు, టాక్సీ స్టాండ్ అసోసియేషన్ నాయకులు, రైల్వే కూలిలు ఐపీఎఫ్‌ను ఘనంగా సన్మానించారు.

మొక్కుబడిగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం.. ఫోటోలకు పోజులతో సరి

ప్రజాశక్తి -దొరవారిసత్రం: దొరవారిసత్రం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సుమారు 60 మందికి పైగా ఆరోగ్య సిబ్బంది పనిచేస్తున్నా ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని మొక్కుబడిగా బ్యానర్ పెట్టి ఫోటోకి పరిమితం చేశారు. ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు చేపట్టలేదు. ఇంత నిర్లక్షంగా వ్యవహరిస్తున్న ఆరోగ్య సిబ్బందిపై ప్రజలండి విమర్శలు వినవస్తున్నాయి.

వేసవిలో తిరుపతికి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: వేసవి నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సౌత్ సెంట్రల్ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. చర్లపల్లి-తిరుపతి మధ్య రెండు వారాల పాటు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించింది. ఈ రైళు ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఉంటాయని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైళ్లకు సంబంధించి షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి.

చర్లపల్లి - తిరుపతి మధ్య నడిచే ప్రత్యేక రైళ్ల వివరాలు

రైలు నెం. 07017 (చర్లపల్లి నుంచి తిరుపతి): ఈ ప్రత్యేక రైలు జూన్ నెల 2, 6, 11, 13, 18, 20, 25, 27 తిరుపతికి వెళ్తుంది. అటు జూలై 2, 4, 9, 11, 16, 18, 23, 25, 30 తేదీలలోనూ ఈ రైలు చర్లపల్లి నుంచి తిరుపతికి వెళ్లనుంది. ఇక ఈ రైలు ఆయా తేదీలలో రాత్రి 9:35 గంటలకు చర్లపల్లి నుంచి బయల్దేరుతుంది. మరుసటి రోజు ఉదయం 10:10 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది.

రైలు నెం. 07018 (తిరుపతి నుంచి చర్లపల్లి): ఇక ఈ ప్రత్యేక రైలు తిరుగు ప్రయాణంలో భాగంగా జూలై 30వ తేదీ ఆగస్టు 2, 3, 5, 10, 12, 17, 19, 24, 26, 31 తేదీలలో తిరుపతి నుంచి చర్లపల్లికి రానుంది. ఈ రైలు తిరుపతిలో సాయంత్రం 4:40 గంటలకు బయల్దేరుతుంది. మరుసటి రోజు ఉదయం 7:10 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

రైళ్లు ఏ స్టేషన్లలో ఆగుతాయంటే? ఇక తిరుపతి ప్రత్యేక రైళ్లు మల్కాజిగిరి, కాచిగూడ, ఉమ్దనగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, దద్వాల్, కర్నూలు సిటీ, ధోనే, గూటి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రాజంపేట స్టేషన్లలో ఆగుతాయి. ఈ రైళ్లలో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్, జనరల్ క్లాస్ కోచ్లు ఉంటాయి. ఈ రైళ్లను ఉపయోగించుకుని ప్రయాణీకులు ఇబ్బందిలేకుండా తిరుపతికి వెళ్లి రావచ్చిన సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు వెల్లడించారు.

కెయంఆర్ న్యాయ కళాశాల గుర్తింపును రద్దు చేయండి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, యూనివర్సిటీ నియమ నిబంధనలకు విరుద్ధంగా పుత్తూరులో కొనసాగుతున్న కేఎంఆర్ న్యాయ కళాశాల గుర్తింపును రద్దుచేసి అక్కడ చదువుతున్న విద్యార్థులను ఇతర న్యాయ కళాశాలలో ప్రవేశం కల్పించి న్యాయం చేయాలని ఉప కులపతి ఆచార్య అప్పారావుకు ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ వినతిపత్రం ఇచ్చారు. ఒకే భవనంలో బీఈడీ , డిఎడ్, నర్సింగ్, ఫిజియోథెరపీ కోర్సులు నిర్వహిస్తున్నారు. కావున సంబంధిత న్యాయ, బీఈడీ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని కోరారు.

జోనల్ స్పోర్ట్స్ మీట్ విజేత శ్రీచైతన్య-2

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తిరుపతి నగరం తుమ్మలగుంట క్రీడా మైదానం వేదికగా శ్రీ చైతన్య విద్యా సంస్థలు నిర్వహించిన జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన శ్రీచైతన్య-2 బ్రాంచి విద్యార్థులు విజేతలుగా నిలిచారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ భూపతి నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. చదువే కాకుండా ఆటల్లో కూడా విద్యార్థులు రాణించేలా స్పోర్ట్స్ మీట్ ఏర్పాటుచేసిన శ్రీ చైతన్య విద్యాసంస్థల నిర్వాహకులను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూపా దేవి, పీఈటి మీనా తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలో భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని టిడిపి మండల అధ్యక్షులు గాలి మురళీనాయుడు అధికారులను కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మురళి నాయుడు పాల్గొన్నారు. అక్రమ ఇసుక, గ్రావెల్ తవ్వకాలను అరికట్టాలని అధికారులను కోరారు. గ్రామాల్లో మంచినీటి సమస్యలను తీర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్ రావు, ఎంపీడీవో సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన ఫీచర్స్‌తో అర్బన్ క్రూయిజర్ హైరైడర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌లో భద్రత, సౌకర్యం, సౌలభ్యాన్ని పునర్నిర్వచించే ఫీచర్ అప్‌గ్రేడ్‌లను ప్రవేశపెట్టినట్లు సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ వరీందర్ వాధ్వా తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి సెల్ఫ్-ఛార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఎస్యూవియు గుర్తింపు పొందిన అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఇప్పటికే 1 లక్ష వాహనాల అమ్మకాల మైలురాయిని దాటిందని తెలిపారు. ఈసదర్భంగా ఆయన ఆ కారు ఫీచర్స్‌ను వివరించారు. వివరాలకోసం కస్టమర్లు టొయోటా డీలర్‌షిప్‌ను సందర్శించవచ్చని లేదా టయోటా ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

బలవంతపు భూసేకరణ ఆపండి

ఏపీ ఐఐసికి ఒక సెంటు భూమి కూడా ఇచ్చేది లేదు.. రైతుల ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి - సత్యవేడు: తిరుపతి జిల్లా, సత్యవేడు మండలం, శ్రీ సిటీ పరిధిలోని ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటీపాకం (రాచపాళెం), రాళ్లకుప్పం గ్రామాల్లో ప్రభుత్వం ఏపీఐసీసీ ద్వారా సేకరిస్తున్న భూసేకరణకు తమ పొలాలను ఒక సెంటు కూడా ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు ఆ నాలుగు గ్రామాల్లో చెందిన రైతులు ఇరుగుళంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రైతుల మాట్లాడుతూ శ్రీసిటీ ఏర్పాటు సమయంలో తొలిదశలో ఏపీ ఐ ఐ సి సేకరించిన భూములలో ఇప్పటికీ ఇంకా 40 శాతం భూములు ఇంకా ఖాళీగానే ఉన్నాయని తెలిపారు. ఖాళీగా ఉన్న భూములను వదిలేసి, మళ్ళీ భూములను సేకరించడం ఎందుకని ప్రశ్నించారు. తమ భూములలో ఒక్క సెంటు కూడా ఏపీఐఐసి కి ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. ఈ మేరకు తమ గ్రామాల్లోని రైతులందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు వారు తెలిపారు.

పేదల ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల పాత్ర కీలకం

న్యాయమూర్తి పి.సంయుక్త

ప్రజాశక్తి - నాయుడుపేట: ప్రభుత్వ వైద్యశాలలకు అనేకరకాల వ్యాధులతో వచ్చే పేదల ఆరోగ్య పరిరక్షణలో వైద్యులు, వైద్య సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్ట్ న్యాయమూర్తి పి.సంయుక్త అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నాయుడుపేట మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో తుమ్మూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జ్ పి.సంయుక్త ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల, ఎ.ఎన్.ఎం లు మెరుగైన సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. నాయుడుపేట బార్ అధ్యక్షులు ఆశా చెంచ కృష్ణయ్య మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవడం ద్వారా భారత దేశ వృద్ధికి తోడ్పడుతుందని చెప్పారు. సీనియర్ న్యాయవాది ఎం.సోమశేఖర్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఆరోగ్య సిబ్బంది చేసిన సేవలను ప్రశంసించారు. అనంతరం న్యాయవాదులు, జడ్జి సంయుక్త, డాక్టర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఎస్ఐ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సి.నారాయణ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అంతర్ రాష్ట్ర ముద్దాయి అరెస్టు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : పలు నేరాలకు పాల్పడిన అంతరాష్ట్ర ముద్దాయి ఢిల్లీ గణేశుని అదుపులో తీసుకున్నట్లు క్రైమ్ డీఎస్పి శ్యామ్ కుమార్ తెలిపారు. స్థానిక క్రైయిన్ పోలీస్ స్టేషన్లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల 20వ తేదీ రేణిగుంట రోడ్డు లోని కెఎస్ఆర్ కళ్యాణమండపంలో రిసెప్షన్ జరిగే సమయంలో గదిలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయన్నారు. బాధితులు శ్రీనివాసపురానికి చెందిన రాజగోపాల్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. పాత నేరస్తులను విచారించి వారిపై నిఘా పెట్టామని, అనుమానస్పదంగా వ్యవహరిస్తున్న ఢిల్లీ గణేష్‌ను సోమవారం ఉదయం తిరుచానూరు రోడ్డులోని తాటి బెల్లం హోటల్స్ సమీపంలో అదుపులో తీసుకున్నామని వెల్లడించారు. అతని వద్ద నుంచి 11.2 గ్రాముల బంగారు, 674 గ్రాములు వెండి ఆభరణాలు, 59,500 రూపాయల నగదు, చోరీకి ఉపయోగిస్తున్న హీరో ప్రొ మోటార్ సైకిల్‌ను స్వాదినం చేసుకున్నామని, ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలిస్తున్నట్లు తెలిపారు. నిందితుడి అరెస్టు, సొత్తు స్వాధీనానికి సహకరించిన తిరుపతి సిసిఎస్ ఇన్స్పెక్టర్‌లు యన్.శివ కుమార్ రెడ్డి, జి.ప్రకాష్ కుమార్, సబ్-ఇన్స్పెక్టర్ యం.ప్రదీప్ కుమార్ రెడ్డి, క్రైమ్ పార్టీ సిబ్బంది హెడ్ కానిస్టేబుళ్ళు మురళి, రమేశ్, గోపికృష్ణ, మునిరాజ, కానిస్టేబుల్స్ నాగరాజు, మోహన్, ప్రసాద్‌లను తిరుపతి జిల్లా ఎస్పీ అభినందించి వారికి నగదు రివార్డ్‌లు అందజేసినట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితునికి 6 నెలలు జైలు శిక్ష

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చోరీ కేసులో నిందితుని కి 6 నెలలు జైలు శిక్ష, పది వేల రూపాయలు జరిమానా విధిస్తూ గూడూరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పి.లోకనాథం తీర్పు నిచ్చారు. గత ఏడాది ఆగస్టు 25 వ తేదీన గూడూరు మండల పరిధిలోని తాళ్ళమ్మ గుడి వెనుక ఉన్న బండి సుబ్రమణ్యం పొలంలో ఉన్న షెడ్‌లో రాగి వైరు, పైపులు, ఐరన్ షీట్‌లను చల్లం శీనయ్య చోరీ చేశాడు. అప్పట్లో గూడూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కేసు నమోదు చేశారు. నిందుతుడు చోరీ చేసినట్లు నేరం రుజువు కావడంతో 6 నెలలు జైలు శిక్ష, పది వేల రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

కక్ష పూరిత రాజకీయాలు వీడాలి

ప్రజాశక్తి -కోట : గ్రామాల్లో శాంతియుతంగా ఉండే రాజకీయాలు ఉండాలే తప్ప కక్షపూరితమైన రాజకీయాలను విడనాడాలని కొత్తపట్నం పంచాయతీ ఉపసర్పంచ్, మాజీ జడ్పిటిసి ఉప్పల ప్రసాద్ గౌడ్ అన్నారు. సోమవారం కోట మండలం, కొత్తపట్నం పంచాయతీ పరిధిలో ఆయన మాట్లాడుతూ వైసిపి రాష్ట్ర నాయకులు పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి ముఖ్య అనుచరులు ఉప్పల ప్రభాకర్ గౌడ్ గ్రామానికి వచ్చిన సందర్భంగా ఆయన అభిమానులు ఘనంగా ఆహ్వానించడం జరిగింది. అనంతరం మాజీ జడ్పిటిసి ఉప్పల ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ వైసీపీ సీనియర్ నాయకులు ఉప్పల ప్రభాకర్ గౌడ్ కొన్ని అనివార్య కారణాలవల్ల గ్రామానికి దూరంగా ఉండడం జరిగిందని, ఈ మేరకు ఉప్పల ప్రభాకర్ గౌడ్ ప్రస్తుతం గ్రామానికి రావడంతో ఆయన్ను అభిమానులందరూ ఆత్మీయంగా సన్మానించారని తెలిపారు. వైసిపి రాష్ట్ర నాయకులు పెర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లో శాంతియుతంగా ఉండే రాజకీయాలు చేస్తామే తప్ప ఎలాంటి విద్వేషాలకు గురి అయ్యే రాజకీయాలు చేయమని చెప్పారు. ప్రస్తుతం కొందరు కక్షపూరితమైన రాజకీయాలు చేస్తున్నారని బాధ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ఉప్పల ప్రభాకర్ గౌడ్, విన్నమాల వెంకటాద్రి, తదితర వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

గొంతెదుతున్నా.. పట్టించుకోరా..?

చలివేంద్రాల జాడెక్కడ..?

ప్రజాశక్తి - ఓజిలి : రోజురోజుకి పెరుగుతున్న భానుడి ఉష్ణ తాపం ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తోంది. ఉదయం 9 గంటలు దాటిందంటే చాలు మండలంలోని ప్రధాన కూడళ్ల నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. భానుడి ప్రతాపానికి ప్రజలు బెంబేలెతి పోతున్నారు. గ్రామాలతో పాటు మండల కేంద్రాల్లో కూడా తాగునీటి చలివేంద్రాలు ఎక్కడా కానరావడంలేదు. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు అధికారులు పలు చర్యలకు ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది. ఇందులో ప్రధానంగా చలివేంద్రాల ఏర్పాటుకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన అధికారులకు లేకపోవడంతో ప్రజలు దాహార్తితో ఇబ్బంది పడుతున్నారు. మండలంలో ఎక్కడ కూడా పంచాయతీ, రెవెన్యూ సంబంధిత శాఖల వారు చలివేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రానికి నిత్యం ప్రజలు వివిధ పనులపై రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఇప్పటికే ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిఉండగా అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తున్నారు. మంచినీరు కొనుక్కుని దాహార్తిని తీర్చుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయిని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో దాతలు కూడా చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావడం లేదు. కొన్ని పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటుచేస్తే వాటికి అయ్యే ఖర్చులకు నిధులు ఎవరు ఇస్తారనేది ప్రశ్నార్థకంగా మారడంతో గ్రామ పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటుకు ఎవరూ ముందుకు రావడం లేదని ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. దీంతో అధికారులు ఈ ఏడాది చలివేంద్రాలు ఏర్పాటు చేసే ఆలోచనలం లేనట్టేనా అని నందేహాలం నెలకొన్నాయి.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE; GUDUR.
O.S.NO. 350 /2023.

Union Bank of India, Gudur
Represented by its Branch Manager.
...Plaintiff.

VS

Syed Shamshad ...Defendant.

NOTICE

To. Smt. Syed Shamshad, W/o Sardhar
Door No.11-173, Dargha Street,
East Gudur, Gudur Mandal Tirupati D.T.

Take notice that the above suit is stands posted to 01-05-2025 for your appearance before this Honorable Court. You are required to attend the said Honorable Court at 10-30 A.M. on 01-05-2025 either in person or through your Advocate. Failing which ex- parte order would follows.

A. SUBRAMANYAM. B.Sc., B.L.
ADVOCATE,
GUDUR.

పాఠ్య పుస్తకాల వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025-20 విద్యా సంవత్సరానికిగాను, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సోమవారం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దరిశా గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఏకాంబరాచారి, నిరంజన్, అమ్ము దేవి, రమాదేవి, సునీత, చక్రధర్, అపరంజి, కేశవ రెడ్డి, ఆర్పి, సీనియర్ సహాయకులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

తలారి సిద్దయ్యకు నివాళి

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని ఉస్తికాయలపెంట పంచాయతీ దేవవాన్లపల్లికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు తెలారి సిద్దయ్య గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం సిద్దయ్య స్వగ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రాల్లో చల్లని తాగునీరు అందిస్తాం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: వేసవిలో నగర ప్రజలు, యాత్రికుల దాహార్తిని తీర్చేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాల్లో చల్లని నీరు అందిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రామానుజ కూడలి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం మధ్యాహ్నం కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని 12 ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. దాతలు ముందుకు వస్తే చల్లని మజ్జిగ కూడా అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డి. ఈ. లలితలు ఉన్నారు.

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో

వివిధ పరిషత్తుల సమాపన సమారోహం

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో విద్యార్థుల భాషణ మరియు స్మృతి శక్తిని, పోటీ తత్వాన్ని పెంపొందించడం కొరకు సంస్కృత భాషకు వాగ్వర్ధినీ పరిషత్, ఆంగ్లం భాషకు మాక్స్ ముల్లర్ ఇంగ్లీష్ క్లబ్, తెలుగుకు అన్నమాచార్య కళాపరిషత్, హిందీ భాషకు తులసీదాస్ హిందీ పరిషత్ మొదలగు విద్యార్థుల్లోని విభిన్న కౌశలాలను వెలికితీస్తూ వివిధ పోటీల్లో అగ్రగామిగా నిలుస్తుంది.ఈ పరిషత్తుల సమాపన సమారోహం విశ్వవిద్యాలయంలోని చెలికాని అన్నారావు సభా భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్నటువంటి కౌశలాలను పెంపొందించడం కొరకు ఈ పరిషత్తులు ఎంతో విశేషమైన కృషి చేస్తున్నాయని తెలియజేశారు. ప్రత్యేకించి వాగ్వర్ధిని పరిషత్ విశేషమైన కృషి చేస్తూ విద్యార్థులను రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో జరిగేటువంటి వక్తృత్వ, నిబంధ రచన, వాద వివాద మొదలైనటువంటి పోటీల్లో పాల్గొని, వారు బహుమ తులను సంపాదించడం ఎంతో ఆనందదాయకమని తెలియజేశారు. ఈ సంవత్సరం ఉత్తరాఖండ్లో జరిగినటువంటి అఖిల భారతీయ సంస్కృత శాస్త్రీయ స్పర్ధల్లో విశ్వవిద్యాలయ విద్యార్థులు బంగారు పతకాలను గెలుచుకు రావడం విశ్వవిద్యాలయానికి ఎంతో గౌరవప్రదమని తెలియజేశారు. అదే విధంగా ఇంగ్లీష్, తెలుగు, హిందీ పరిషత్తులు కూడా ఈ విధమైనటువంటి కృషిని చేస్తూ విద్యార్థుల సర్వాంగీణ వికాసానికి ఎంత దోహదం చేస్తున్నాయని హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ పరిషత్తుల కోఆర్డినేటర్స్, అడిషనల్ కోఆర్డి నేటర్స్ని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ సంవత్సర కాలంలో నిర్వహించిన టువంటి వివిధ సెషన్స్లో విజేతలు అయినటువంటి విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ వాగ్వర్ధినీ పరిషత్ కోఆర్డినేటర్ డా.సి.హెచ్.నాగరాజు, అడిషనల్ కోఆర్డినేటర్ డా.ఉదయన హెగ్డే, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్

: పులివర్తి సుధా రెడ్డి

ప్రజాశక్తి - రామచంద్రాపురం: మహిళల భద్రతకు శక్తి యాప్, 1002 ఫ్రీ డైల్ నెంబర్ ఎంతగానో ఉపయోగపడతాయని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి అన్నారు. సుధా రెడ్డి చంద్రగిరి పట్టణంలోని దాసరి వీధి, జమాండ్ల వీధిలో మహిళలతో సోమవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, గౌస్ బాషా, సింగు సుధా, కొత్తపల్లి సునీత, సక్కరీరు ధనంజయ రెడ్డి, సునీల్, మహిళలు, యువత, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిమూలం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పిచ్చా టూరు: ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జన్మదిన వేడుకలను పిచ్చాటూరులో సోమవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సమక్షంలో టీడీపీ నాయకులు ఇలంగోవన్ రెడ్డి, పద్దు రాజు, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు, పాత్రికేయులు, పలువురు యువత రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయకట్టు ఛైర్మన్ రవి, వాసు రెడ్డి, జయ చంద్ర నాయుడు, భక్తి రెడ్డి, ఢిల్లీబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగలో.. ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని బస్టాండ్ ఆవరణలో సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు ముని చంద్రనాయుడు, రవి నాయుడు, కార్తీక్ నాయుడుల ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్.ఆర్.ఎం. యూనివర్శిటీచే బి.స్కూల్ యంబిఎ పై సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి ఎం.ఆర్.పల్లిలోని 'కౌటిల్య ఇన్స్టిట్యూషన్' లో అమరావతికి చెందిన ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ 'మేనేజ్ మెంట్ ఎడ్యుకేషన్ లో అపార అవకాశాలు' అనే అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి తిరుపతికి చెందిన 100 మంది డిగ్రీ, బి.టెక్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ డాక్టర్ భరద్వాజ్ శివకుమారన్, డీన్ ప్రొఫెసర్, శివ శంకర్ ఎల్లంపల్లి, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ హాజరయ్యారు. విద్యార్థులు ఉన్నత విద్యపై అనేక సందేహాలకు వివరణ తీసుకొన్నారు. ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ డీన్ శివశంకర్ ఎల్లంపల్లి మాట్లాడుతూ ఇప్పుడు జాబ్ మార్కెట్ లో ఆర్థిక మాంద్యం ఉన్నప్పటికీ, మంచి కాలేజ్ లో ఎమ్బిఎ డిగ్రీ చెయ్యడం ద్వారా మంచి కెరీర్ ను సంపాదించుకోవచ్చు. ఇలాంటి సమయం లోనే విద్యార్థులు ఇప్పుడు కొత్త నైపుణ్యాలు మెరుగుపరచుకొని పరిశ్రమలకు అనుగుణంగా అభివృద్ధి చెందాలి. మేనేజ్ మెంట్ చదివిన విద్యార్థులకు అన్ని రంగాలలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. ఎమ్బిఎ సంపాదించడం వల్ల విస్తృత శ్రేణి ప్రయోజనాలు లభిస్తాయి, వాటిలో నాయకత్వం మరియు సమర్థవంతమైన నిర్ణయం తీసుకోవడానికి అవసరమైన కఠినమైన, మృదువైన వ్యాపార నైపుణ్యాల అభివృద్ధి కూడా ఉంటుందని చెప్పారు. ఈ బిజినెస్ స్కూల్ ఎమ్బిఎ వాస్తవ ప్రపంచ వ్యాపార సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధం చేస్తుంది. విద్యార్థు లకు వివిధ రంగాలకు సంబంధించిన నెట్వర్క్ ఏర్పరచుకోవడంలో, విస్తృతమైన పూర్వ విద్యార్థుల నెట్వర్క్లను చేరుకోవడంలో సహాయపడతాయని అన్నారు. తద్వారా బిజినెస్ స్కూల్ ఎమ్బిఎ ద్వారా, విజయవంతమైన కెరీర్ సంపాదించుకోవచ్చు. పైన చెప్పిన లక్షణాలతో, ఇదే ప్రమాణాలతో, మన అమరావతి లోని ఎస్.ఆర్.ఎం యూని వర్సిటీ మంచి నాణ్యమైన ఎమ్బిఎ కోర్స్ ఆఫర్ చేస్తున్నది. అడ్మిషన్స్ జరుగుతున్నాయి. డిగ్రీ పూర్తిచేసిన చివరి సంవత్సరపు విద్యార్థులు ఈ ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ ఆంధ్ర ప్రదేశ్ వెబ్సైటు ద్వారా అప్లై చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్, సీనియర్ మేనేజర్ ఎన్.ఎస్.రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

బుచ్చినాయుడు కండ్రిగ - ప్రజాశక్తి: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్త కుండా చూడాలని తహశీల్దార్ శ్రీదేవి తెలిపారు. ఆమె సోమవారం స్థానిక తహసీ ల్దారు కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కలిసి ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ చంద్రబాబు నాయుడు, ఎంపీడీఓ త్రివిక్రమావు, ఎంఈఓ మునిసుబ్రమణ్యం, అగ్రికల్చర్ అధికారిణి భారతి, ఆర్డబ్ల్యూఎస్ ఎఈ వింద్య, రెవిన్యూ ఇన్స్పెక్టర్ నల్లయ్య, ఏపిఎం మునయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

ఆరోగ్య రక్షణకు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : ఏప్రిల్ 7 తారీఖున ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా ఆరోగ్యకరమైన ప్రారంభం - ఆశాజనక భవిష్యత్తు అనే నినాదంతో ఈ సంవత్సరం బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి విద్యాసాగర్, డాక్టర్ మాధవి, ఆరోగ్యాధికారి డిఎన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రాథమిక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో వైద్యులు మాట్లాడుతూ పోషకాహారం తీసుకుంటూ, మంచి జీవన శైలితో ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎంఎల్హెచ్ పిలు, ఆశలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలు నిర్లక్ష్యం చేయకండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే వెంటనే వైద్యులు దగ్గరకు వెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని, విశ్రాంత జిల్లా డిఐఓ డాక్టర్ రవి రాజు తెలిపారు. సోమవారం పుత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్, యూఎస్ఏ వారి ఆర్థిక సహకారంతో డాక్టర్ శ్రీనివాసరెడ్డి, విశ్రాంత డిస్ట్రిక్ట్ లెప్రసీ, ఎయిడ్స్, టీబి ఆఫీసర్ డాక్టర్ రవి రాజుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమంలో, డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ టిబి కంట్రోల్, టీబీ యూనిట్ సిబ్బంది, సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, వైద్య, వైద్యేతర సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు సోమవారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా డాక్టర్ సి. ఆర్ .రెడ్డి ఆరోగ్య సంజీవని అనే కార్యక్రమం ద్వారా డాక్టర్ జనార్దన్ రెడ్డి, డాక్ట ర్ రోహిణి సహకారాలతో నిర్వహిస్తున్నమన్నారు. ఈ కార్య క్రమంలో సంస్థ ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, వాకాటి రామ్మోహన్ రావు, పయ్యావుల మురళీ నాయుడు, కె.ఆర్.ఎం, కోట వెంకటేశ్వర్లు , వెంకటేశ్వర్లు, నారాయణ, వాకాటి శ్రీనివాసులు, ఆసుపత్రి సిబ్బందిపాల్గొన్నారు.

శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించండి

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: నవజాత శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించి, శిశువుల మరణాలను పూర్తిస్థాయిలో నివారించాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ లీనాకుమారి తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా సోమవారం ఆరోగ్యకరమైన ఆరంభం ఆశాజనక భవిష్యత్తు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మరియు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బ్రెడ్ పంపిణీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నవ సమాజ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు నీల విజయభాస్కర్ ఆధ్వర్యంలో తిరుపతి రుయా హాస్పిటల్ వద్ద రోగులకు, అనాధలకు బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ విభాగం నాయకులు వృధ్ధి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో..

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండల వైద్యులు డాక్టర్ జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం' ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జుబేర్ మాట్లాడుతూ మాతా శిశు మరణాలను నివారణ చేయాలని తెలిపారు. హెల్త్ సూపర్వైజర్ కామరాజు మాట్లాడుతూ మాతాశిశు మరణాల నివారణకు ఆసుపత్రి ప్రసవాలే మంచిదన్నారు. అనంతరం పలు ఆరోగ్య సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ మునిసుబ్బరామిరెడ్డి,హెల్త్ సూపర్వైజర్లు కామరాజు, నాగరాజు,శివశంకర్,జైబున్నీ, అనురాధ,ఎఎన్ఎంలు, ఎమ్ఎల్హెచ్పీలు,ఆశాకార్యకర్త లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రాస్ ఆధ్వర్యంలో.. చైల్డ్ ఫండ్ రాస్, ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో రేణిగుంట మండలం, ఇంద్రానగర్ గ్రామంలోని రాస్ కార్యాలయంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్ రెడ్డి , రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మండల పరిషత్ అభివృద్ధి పనులపై పుత్తూరు ఎంపిపి మునివేలమ్మ, కోఆప్షన్ మెంబర్లు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సుమారు 70 లక్షల రూపాయల నిధులతో జరగాల్సిన అభివృద్ధి పనులు వేగవంతంగా జరగడంలేదని, సిబ్బంది కూడా అందుబాటులో ఉండటం లేదని కలెక్టర్‌కు తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్లు, సర్పంచులు, ఎంపిటీసీలు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం ప్రశాంత వాతావరణంలో నిర్వహించండి

ప్రజాశక్తి - వెంకటగిరి: వెంకటగిరి అవిశ్వాస తీర్మాన ప్రొసీడింగ్ ఆఫీసర్ గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో వెంకటగిరి నియోజక వర్గ వైసిపి కన్వీనర్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్లు సోమవారం ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ తరఫున విప్ పత్రాలను అందజేసి వెంకటగిరిలో జరగనున్న అవిశ్వాస తీర్మానం ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని కోరారు.